క్లుప్తంగా

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై కె.నీలకంఠం, ఏఎస్సై కుమారస్వామి

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలని ఏఎస్సై కుమారస్వామి అన్నారు. ఎస్సై కె.నీలకంఠం ఆధ్వర్యంలో ఏఎస్ఐ కుమారస్వామి సిబ్బందితో కలిసి మండల కేంద్రంలో ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలతో ప్రయాణం చేసే వారివద్ద డ్రైవింగ్‌లైసెన్స్ కాలుష్య నివారణ ధ్రువీకరణ పత్రం, బీమా, సీబుక్ వివరాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అలాగే ఇంతవరకూ ఈ అపరాధ రుసుం చెల్లించని వారు బ్యాంక్‌లో జమ చేయాలని కోరారు. ప్రభుత్వానికి బాకీ పడిన అపరాధ రుసుం విధిగా చెల్లించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే చర్యలు

- మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

పార్వతీపురం టౌన్: ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే అపరాధ రుసుముతో పాటు చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారస్తులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. క్లీన్ పార్వతీపురంగా తీర్చిదిద్దేందు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వాదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినట్లు చెప్పారు. వ్యాపారస్తులు వాటిని విక్రయించినట్లయితే జరిమానా విధించడంతో పాటూ సరుకు స్వాధీనం చేసుకుంటామన్నారు. పలుమార్లు పట్టుబడితే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

వామన, పరశురామ అవతారాలలో జగన్నాథస్వామి



వామన, పరుశురామ అవతారాల్లో స్వామి

బలిజిపేట: జగన్నాథస్వామి ఉత్సవాలలో భాగంగా ఆరవరోజు ఆదివారం స్వామివారిని వామన, పరశురామ అవతారాలలో అలంకరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అర్చకుడు హరి ఆధ్వర్యంలో గుండిచా మందిరం వద్ద స్వామివారికి అవతారాలను మార్పుచేసి పూజాకార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా స్వామివారికి ధూప, దీప నైవేద్యాలు, ప్రసాదాలను సమర్పించారు. గుండిఛా మందిరం వద్దకు గ్రామంలోని భక్తులు వచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించి దర్శించుకుంటున్నారు. భక్తులతో అర్చకులు ప్రత్యేక పూజలు జరిపించారు.

రెండు బైక్‌లు ఢీ: ఇద్దరికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పార్వతీపురం: ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుకవస్తున్న మరో బైక్ ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఆదివారం జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలం వెంకటపేట పంచాయతీ గృహలక్ష్మినగర్‌కు చెందిన యాండ్రాపు సరోజిని, చుక్క అప్పలనాయుడు ద్విచక్రవాహనంపై పాత బస్టాండ్‌కు వెళ్తుండగా గాంధీసత్రం సమీపంలో వెనుకనుంచి వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ వాహనం పైనుంచి రోడ్డుపై పడిపోవడంతో పలుచోట్ల గాయాలయ్యాయి. ఈ మేరకు స్థానికులు గాయాలపాలైన ఇద్దరిని చికిత్స నిమిత్తం పార్వతీపురం ఆస్పత్రికి తరలించారు.

సమన్వయంతో.. జగనన్న సురక్ష విజయవంతం చేయండి

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



సమావేశంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ప్రతి ఇంటిని జల్లెడపట్టి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడం, ప్రజలకు అవసరమైన ముఖ్యమైన పత్రాలు ఉచితంగా అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టిన కార్యక్రమం జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశమని ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన సాలూరులోని తన ఇంట్లో నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్‌లు తదితరులతో జగనన్న సురక్ష కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వచ్చే నెల 1వ తేదీ నుంచి నెలరోజుల పాటు ప్రతి సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుందని తెలిపారు. అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి మండలం, మున్సిపాలిటీలోని సచివాలయాల్లో ఈ కార్యక్రమం చేపడతారని పేర్కొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి

ఈ కార్యక్రమంలో అర్హులుగా గుర్తించిన వారికి ఆగస్టు 1న పథకంలో అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమం ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన పెంపొందించి, సద్వినియోగం చేసుకోవాలని సూచించాలని తెలిపారు.ఎన్నికలు సమీపిస్తున్న వేళ అందరూ సమన్వయంతో,సమష్టిగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ అఖండ మెజారిటీతో ముఖ్యమంత్రిని చేసేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 28న జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన ముగిసిన తరువాత మండలాల వారీగా తాను జగనన్న సురక్ష కార్యక్రమాలపై సమావేశాలు నిర్వహిస్తానని స్పష్టం చేశారు. ఎవరైనా అలసత్వం వహించినట్లు గుర్తిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

నియోజకవర్గానికి మంజూరైన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులతో సమావేశమై మండలాల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనుల ప్రగతిపై ఆరా తీశారు. ఈ క్రమంలో పాచిపెంట మండలం ఈతమానువలస గ్రామంలో వంతెన నిర్మాణం కాంట్రాక్టర్ ప్రారంభించడం లేదని ఎంపీపీ బద్నాన ప్రమీల, వైఎస్సార్‌సీపీ నాయకుడు పాచిపెంట వీరంనాయుడు తెలిపారు. వెంటనే స్పందించిన ఆయన ట్రైబల్ వెల్ఫేర్ ఈఎస్‌సీ శ్రీనివాసరావుతో ఫోన్‌లో మాట్లాడారు. వారం రోజుల్లోగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బీజామృతంతో విత్తనశుద్ధి శ్రేయస్కరం



రైతుల నుద్దేశించి మాట్లాడుతున్న ఏఓ ఎస్ అవినాష్

సీతానగరం: మండలంలోని రైతులు తయారుచేసే బీజామృతంతోనే విత్తనశుద్ధి చేయడం శ్రేయస్కరమని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానం అమలులో భాగంగా మండలంలోని మరిపివలస రైతు భరోసా కేంద్రంలో ఆదివారం రైతులకు బీజామృతం తయారు చేసే విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసి తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం రైతులకు బీజామృతం తయారు చేయడంపై శిక్షణ ఇచ్చారు.

బీజామృతానికి కావాల్సిన పదార్థాలు

ఆవుపేడ 20 కేజీలు, సున్నం 50 గ్రాములు, 20 లీటర్ల నీరు,ఆవు మూత్రం 5 లీటర్లు, పుట్ట మన్ను పిడికెడు.

తయారు చేసే విధానం..

మట్టిపాత్రలో 20 లీటర్ల నీరు తీసుకుని పేడను గుడ్డలో మూటకట్టి నీటిలో వేలాడదీయాలి. అందులో ఆవుమూత్రం, సున్నం కలపాలి.12 గంటల పాటు అలాగే ఉంచాలి. రోజుకు రెండు పర్యాయాలు కర్రతో కలపాలి. అప్పుడు బీజామృతం తయారవుతుంది.

బీజామృతంతో వ్యాధుల నియంత్రణ

విత్తడానికి సిద్ధంగా ఉన్న విత్తనాలపై ఈమిశ్రమాన్ని చల్లాలి. నీడలో ఆరబెట్టిన తర్వాత విత్తుకోవాలి. దీనివల్ల విత్తనం బాగా మొలకెత్తుతుంది. విత్తనం నుంచి సంక్రమించే వ్యాధులను నియంత్రిస్తుంది. అరటి పిలకలు, చెరకు కణుపులను బీజామృతంలో ముంచి నాట్లు వేయాలి. వరి, ఉల్లినారు, మిరప, టమాటో, వంగ, నార్లను బీజామృతంతో శుద్ధి చేయాలి. ఈ విషయాలన్నీ ఇక్కడ శిక్షణ పొందిన రైతులు గ్రామాల్లో మిగిలిన రైతులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే మూడోలైన్ పక్కన కాలువ



కాలువ పనులను పరిశీలిస్తున్న కార్యదర్శి మనోహర్

సీతానగరం: మండలంలోని చినభోగిలి వద్ద రైల్వే మూడోలైన్ ట్రాక్ పనులు జరుగుతున్నందున ఇందిరా కాలనీలో వర్షం నీరు నిల్వ ఉండి పోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా పంచాయతీ పాలకులు ప్రత్యామ్నాయంగా కాలువలు తీయడం ఆరంభించారు. ఈ మేరకు ఆదివారం ఉదయం సర్పంచ్ కురమాన రాధ పర్యవేక్షణలో ఇందిరా కాలనీలో కాలువ నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ఎం.మనోహర్ మాట్లాడుతూ రైల్వేలైన్ నిర్మాణంలో భాగంగా ట్రాక్ నిర్మాణానికి రోడ్డు వేయడం వల్ల కాలనీలో వర్షం నీరు, ఇళ్లలో వాడుక నీరు కాలువల్లో నిల్వ ఉండి పోయి దుర్గంధం వెదజల్లడంతో కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని నీరుమళ్లించడానికి నూతనంగా కాలువ పనులు చేపడుతున్నామని తెలియజేశారు. ఇప్పటికే మండల అధికారులకు తెలియజేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కురమాన శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ గంటా రమేష్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా రహదారుల ఆక్రమణ

- జిల్లాకేంద్రంలో ఇబ్బడిముబ్బడిగా వ్యాపారాలు
- అధికారులు చెబుతున్నా పట్టించుకోని వ్యాపారస్తులు





రహదారిపై ఆక్రమణలు

పార్వతీపురంటౌన్: జిల్లాకేంద్రం పార్వతీపురం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న రహదారులు ఆక్రమణకు గురవుతున్నాయి. వ్యాపారం పేరుతో తోపుడుబండ్లు, డీజిల్ ఆటోలు ఏర్పాటు చేసుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. పట్టణంలో రోజురోజుకూ జనాభా అధికమవుతున్న తరుణంలో రహదారి ఆక్రమణలతో రానున్న రోజుల్లో పెద్ద సమస్య వచ్చి పడే ప్రమాదం ఉంది. పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా పాదచారులు నడిచేందుకు వీలులేకుండా వ్యాపారులు ఆక్రమించారు. ఉదయం 9 గంటలు మొదలుకుని రాత్రి వరకు రహదారికి ఇరువైపులా జోరుగా వ్యాపారాలు సాగుతున్నాయి. పూలు, పండ్లు, కూరగాయలు, మొక్కలు, డ్రైఫ్రూట్స్, క్యాంటీన్, చికెన్ కార్నర్స్ తదితర దుకాణాలను ఏర్పాటు చేశారు. వాటిని కొనుగోలు చేసేందుకు వచ్చే ప్రజలు రోడ్డుకడ్డంగా వాహనాలు నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది. నాలుగు రోడ్ల కూడలి వద్ద రైతు బజార్ ఉండడంతో నిత్యం వందలాది మంది కురగాయల కొనుగోలుకు వస్తుంటారు. ఆస్పత్రి ముందు పదుల సంఖ్యలో తోపుడు బండ్లు, అంబులెన్సులు ఏర్పాటు చేశారు. దీంతో పాదచారులు నడిచేందుకు వీలులేని పరిస్థితి. ఆ ప్రాంతం నుంచి ఆర్‌డీఓ, అగ్నిమాపక కార్యాలయాలకు పాదచారులు, వాహనదారులు వెళ్తుంటారు. ఇలాంటి ప్రాంతంలో ఇబ్బడిముబ్బడిగా రోడ్లకు ఇరువైపులా దుకాణాలు వెలిశాయి. పట్టణ శివారులో బెలగాం ప్రాంతం వద్ద ప్రధాన రహదారిపై అనధికారంగా చేపల మార్కెట్ నిర్వహిస్తుండంతో రహదారిపై వాహనాలు నిలుపుదల చేస్తున్నారు. దీని వల్ల కూడా ప్రమాదాలు సంభవించే ఆస్కారం ఉంది.

అవగాహన కల్పిస్తున్నా కానరాని ఫలితం

ప్రధాన రహదారి ఆక్రమణలకు గురికాకుండా మున్సిపల్ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు అవగాహన కల్పిస్తున్నా వ్యాపారులు పట్టించుకోవడంలేదు. ఈ ఆక్రమణల వల్ల జరిగే ప్రమాదాలు, కలిగే ట్రాఫిక్ అంతరాయాన్ని వివరిస్తున్నా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ముందుచూపు లేకుండా వారు వ్యవహరిస్తున్న తీరు భవిష్యత్‌లో ఇబ్బందులు తెచ్చిపెడుతుందని పట్టణ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

రహదారులు ఆక్రమణలకు గురైన మాట వాస్తవమే. ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారుల సమన్వయంతో ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాం. ఇప్పటికే పలుమార్లు ట్రాఫిక్ సిబ్బందితో కలిసి సమావేశాలు నిర్వహించాం. రహదారులు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటాం.

–రామప్పల నాయుడు, మున్సిపల్ కమిషనర్, పార్వతీపురం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



జగనన్న సురక్ష పథకంపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- అదే జగనన్న సురక్ష లక్ష్యం
- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష పథకం ద్వారా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించడానికి గ్రామవలంటీర్లు, గృహసారథులు, సచివాలయ ఉద్యోగులు సర్వే నిర్వహించి కృషి చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు ఆదివారం సీతానగరం మండలం అంటిపేటలో జగనన్న సురక్ష పథకం కార్యక్రమంలో గృహసారథులు, గ్రామ వలంటీర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ జూలై 1 నుంచి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష పథకం అమలుకు అందరూ సమన్వయంతో పనిచేసి జగనన్న ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని, అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా సర్వే నిర్వహించి అర్హతను బట్టి సంక్షేమ పథకాలు, వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేయడానికి సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. గ్రామవలంటీర్లు సేకరించిన సమాచారాన్ని డిజిటల్, వెల్ఫేర్ సహాయకులతో ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బి.శ్రీరాములు, పార్టీ మండల అధ్యక్షులు బి.చిట్టిరాజు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్. తిరుపతి, సర్పంచ్ తిరుపతిరావు, లచ్చయ్యపేట సర్పంచ్ సీహెచ్‌కృష్ణ, ఎంపీటీసీ అక్కపోలు సింహాచలం, వి దానబాబు, సిరికి శ్రీనివాసరావు, టి.అప్పయ్యమ్మ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

ఇటీవలమోటార్ సైకిల్ ఢీకొట్టడంతో గాయాలపాలైన అంటిపేట మాజీ సర్పంచ్ సిరికిమహేశ్వరరావును ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదివారం పరామర్శించారు. మహేశ్వరరావు 1998 డీఎస్సీ ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరిన సమయంలో సహచర ఉపాధ్యాయుడితో మాట్లాడుకుంటూ వెళ్తుండగా ప్రమాదం జరిగింది.

ఒక్క రూపాయికే..రూ.12 లక్షల ఆస్తి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఏపీ టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్

- టిడ్కో గృహ సందర్శనలో పాల్గొన్న టిడ్కో ఛైర్మన్ జమ్మాన

పార్వతీపురంటౌన్: రూ.12 లక్షల విలువైన ఆస్తి ఒక్క రూపాయికే ఇస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డిదేనని ఏపీటిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని అడ్డాపుశీల గ్రామంలో టిడ్కో హౌసింగ్ లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణంలో అనుసరిస్తున్న విధానం, షీర్ వాల్ టెక్నాలజీ, నాణ్యతా ప్రమాణాలతో అందిస్తున్న సదుపాయాల గురుంచి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం, ఇళ్లలో అందిస్తున్న సదుపాయాల పట్ల లబ్ధిదారులు చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఒక్క రూపాయికే సుమారు రూ.12 లక్షల విలువైన ఇల్లును ఆస్తిగా ఇచ్చే ముఖ్యమంత్రి దేశంలో ఎవ్వరైనా ఉన్నారంటే అది కేవలం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. పేదలకు మేలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రాబోయే రోజుల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. పార్వతీపురంలో మొత్తం 678 ఇళ్లను సుమారు రూ.80 కోట్ల వ్యయంతో నిర్మిస్తూ అందజేస్తున్నామని, మంచినీటి సరఫరా 24 గంటలు ఉండేలా, మురుగునీరు పోయేందుకు ఎస్‌టీపీ నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. అనంతరం వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకుల ఆహ్వానం మేరకు ప్రజల సమస్యలపై నిర్వహిస్తున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో అధికారులు, పలువురు సర్పంచ్‌లు ఎంపీటీసీలు పెద్ద ఎత్తున లబ్ధిదారులు, యువజన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పక్కాగా 'జగనన్న సురక్ష' అమలు

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



వీరఘట్టం: ప్రతీ గ్రామంలో జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమం పక్కాగా అమలు చేయాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సూచించారు. మండలంలోని వండవ గ్రామంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడిన ఆమె జూలై 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, మండల స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి, అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని, జనన, మరణ, కుల, ఆదాయం వంటి ధ్రువీకరణ పత్రాలు కావాల్సిన వారిని గుర్తించి, వారికి పథకాలు, ధ్రువీకరణ పత్రాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఇప్పటివరకు జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గుర్తించిన పాలకొండ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గుర్తించిన ప్రజాసమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ సచివాలయం పరిధిలో రూ.20 లక్షల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టి, పూర్తి చేయాలన్నారు. ఈ నెల 28వ తేదీన అమ్మఒడి నాలుగో విడత నిధుల జమ చేసే కార్యక్రమ ప్రారంభోత్సవానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేస్తున్నారని, పాలకొండ నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులంతా కార్యక్రమానికి తరలివచ్చి, విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

అంబులెన్స్ సేవలను పునరుద్ధరిస్తాం

సీతంపేట: సాంకేతిక పరమైన సమస్యల కారణంగా ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న పలు అంబులెన్స్‌ల సేవలను నిలిపివేశారు. దీంతో రోగాల బారినపడిన గిరిజనులు వైద్యం కోసం సకాలంలో ఆస్పత్రి చేరుకునేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సీతంపేట ఏజెన్సీలోని పలు పీహెచ్‌సీల అంబులెన్స్‌ల రాకపోకలు గత వారం, పదిహేను రోజుల నుంచి నిలిచిపోగా, మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేసే కేసులను శ్రీకాకుళం, విశాఖపట్నం ప్రాంతాల్లోని ప్రభుత్వాస్పత్రులకు తరలించడం కష్టతరమవుతోంది. ఈ నేపథ్యంలో రోగులు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. దీనిపై స్పందించిన డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ విజయపార్వతి త్వరలోనే అంబులెన్స్ సేవలను పునరుద్ధరిస్తామని తెలిపారు.

బీజామృతంతో విత్తనశుద్ధి మేలు



బీజామృతంతో విత్తనాలను శుద్ధి చేయడంపై అవగాహన కల్పిస్తున్న ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: బీజామృతంతో విత్తనశుద్ధి చేస్తే ఎంతో మేలు అని ఏపీసీఎన్‌ఎఫ్ మండల కో–ఆర్డినేటర్ కె.భూషణరావు తెలిపారు. ఆదివారం మండలంలోని ఎస్.కె.పాడు గ్రామంలో బీజామృతం తయారీ, వినియోగం దాని ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. తొలుత పలువురు రైతులతో ఆవు పేడ, ఆవుమూత్రం, తెల్లసున్నం, పుట్టమన్ను, నీటితో బీజామృతం ఎరువును ప్రయోగాత్మకంగా తయారు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్నందున రైతులంతా చిరుధాన్యాలు, ఆహారధాన్యాలు, పప్పుదినుసులు తదితర విత్తనాలను ఈ బీజామృతంతో శుద్ధి చేసుకుని, పొలాల్లో చల్లుకోవాలన్నారు. దీని ద్వారా విత్తనాల మొలక శాతం పెరుగుతుందని, అంతేకాకుండా విత్తనాలకు హాని కలుగజేసే నేలలోని సూక్ష్మజీవులను నివారిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంటీలు మహేష్, జి.నిర్మల దేవి, తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయ విధానంలో భాగంగా మండలంలోని ఉల్లిబద్ర గ్రామ రైతు భరోసా కేంద్రంలో బీజామృతంతో విత్తనశుద్ధి చేయడంపై అవగాహన కల్పించారు. ఐసీఆర్‌పీ ఇందిర మాట్లాడుతూ ఆవుపేడ, ఆవు మూత్రం, తెల్లసున్నం, పుట్టమన్నుతో తయారు చేసిన బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేసుకుని పొలంలో చల్లితే విత్తనాలు బాగా మొలకెత్తుతాయని, పంటకు పట్టే చీడపీడలు నివారించవచ్చన్నారు. ఈ పద్ధతిలో విత్తనాలు శుద్ధి చేయడం వల్ల వరినారుకు 30 రోజుల వరకు ఎటువంటి తెగులు కానీ పురుగులు కానీ పట్టవన్నారు.



గరుగుబిల్లి: బీజామృతంతో ధాన్యం విత్తనాలను శుద్ధి చేస్తున్న దృశ్యం